

# అనివార్యం

ముసురు..ముసురు..ఎనిమిది రోజులనుండి ఒకటే ఎడతెగని ముసురు. ప్రకృతంతా తడిసి ముద్దయినట్టు రొచ్చు...అంతా నీటి వాసన..తేమ వాసన..తడివాసన.

వసుధ వానలోకి చూస్తోంది తదేకంగా.

వాన...వాన...ఒకటే వాన...బయట వాన...లోపల వాన... లోలోపల...గుండెల్లో...గుండె లోలోతుల్లో భీకరమైన వాన.

ఇంజనీరింగ్ కాలేజి మూడవ అంతస్తు - పిట్టగోడ నానుకుని వానలోకి చూస్తూ ఆలోచిస్తోంది వసుధ.

"దిసీజ్ షేమ్‌ఫుల్ టుమి...ఒక ప్రొఫెసర్ కూతురువి, ఒక ప్రామినెంట్ యింజనీర్ చెల్లెలివి, ఒక డియెస్సీ ముద్దుల చెల్లెలివి... యిలా సైకిల్‌పై ఇంజనీరింగ్ కాలేజీకి వెళ్తావా..గో బై కార్..కం బై

కార్.. ట్వంటీఫోరవర్స్ డ్రైవర్ చెట్టుకింద కారుపెట్టుకుని కూర్చుంటాడు. అడుగు బైటపెడ్తే నీ పాదాలకి దోసిలిపడ్తాడు..బట్...నువ్వు మా మాట వినవు..ఆదర్శాలు.. ఆదర్శాలు కావాలి నీకు..సిద్ధాంతాలు కావాలి నీకు. సైకిల్పై వెళ్తావు..అతి మామూలు బట్టలు వేసుకుంటావు..అదో ప్రపంచంలో జీవిస్తూ ఆకాశంలోకి ఎగిరిపోతావు"..

నాన్న మాటలు..నాన్న కేకలు...డబ్బే జీవితమై...డబ్బే ఊపిరై...మనిషిని డబ్బుతో మాత్రమే కొలువగలిగే ఓ దుర్మార్గ జీవనశైలికి అలవాటై, మొదట్నుంచీ యిదే ఘర్షణ.

అతను కార్పొరేట్ కాలేజీలో చదవమంటాడు.

తను మామూలు ప్రభుత్వ రెసిడెన్షియల్ స్కూల్లో చదివింది పట్టుబట్టి.

కోటానుకోట్ల మందికి అందుబాటులో లేని విద్య...విద్యను ఓ అందని దినుసును చేసి కార్పొరేట్ బాహువుల్లో బంధించి ఆడిస్తూంటే వికృత నృత్యం చేస్తున్న వ్యవస్థ...ప్రభుత్వాలు...విచ్చలవిడి బహిరంగ దౌర్జన్యాలు...పత్రికల్లో పేజీలకు పేజీలు ప్రకటలకు....లక్షల కోట్లు ఖర్చు...అవినీతి...అవినీతి... బహిరంగమైన అవినీతి..

"అమ్మా...వర్షం వెలిసేటట్టు లేదు...అందరు ఎల్లిపోయిండ్రు...."

ప్రక్కన అటెండర్ వీరస్వామి...

కాలేజీ అంతా నిర్మానుష్యం-

ఒకటే వర్షం.

వసుధ బ్యాగును భుజానికి తగిలించుకుని క్రిందికి దిగి మెట్ల ప్రక్కనున్న తన సైకిల్ను తీసుకుంది.

పెడల్పై కాలేసి చినుకుల్లోకి...

చినుకులు...చినుకులు...టప టపా...

ఎనిమిది కిలోమీటర్లు తొక్కాలి సైకిల్పై యింటికి వెళ్లాలంటే-

చిక్కగా చినుకులు...అప్పుడప్పుడు విసురుగా వీస్తున్న గాలి... గుండుసూదుల్లా గుచ్చుకుంటున్నాయి చినుకులు.

గుచ్చుకోవడం ఓ చిత్రమైన సందర్భం మనిషికి.

చినుకులు గుచ్చుకుంటున్నాయి...మాటలు గుచ్చుకుంటున్నాయి. చూపులు గుచ్చుకుంటున్నాయి..ఎదుటి మనిషి దుశ్చేష్టలు గుచ్చుకుంటున్నాయి. హృదయానికి నచ్చని జీవితం గుచ్చుకుంటోంది.

చిన్నప్పటినుండి తను లైబ్రరీల్లో గంటలకు గంటలు చదివి ఒంటపట్టించుకున్న సిద్ధాంతాలు గుచ్చుకున్నాయి గుండెల్లో...

ఈ మనుషులు యిలా ఎందుకున్నారు...

ఈ మనుషులు...మనుషులుగా ఉండవలసిన రీతిలో ఎందుకు లేరు.

ఈ మనుషులు...యింత వికృతంగా...ఆలోచించేది వేరు, చెప్పేది వేరు, చేసేది వేరు...కనీస మానవ విలువలు లేకుండా ఎందుకింతగా పతనమయ్యారు. ఈ సమాజం ఎటు పోతోంది.

....సైకిల్ పరుగెత్తుతూనే వుంది.

వర్షం కురుస్తూనే వుంది.

తడుస్తూ, పోతూనే వుంది వసుధ.

అప్పుడు మధ్యాహ్నం లైబ్రరీలో చదివిన ఓ కవిత స్ఫురించింది.

"సిస్టమ్ యిర్రిపేరబుల్ అను జీవిత కథ" అను శీర్షిక

కవి అంటాడు.,

ఈ సైకిల్,

చైన్ పోయింది, పెడల్ పోయింది, సీట్ పోయింది, వీల్ పోయింది, టైరు పోయింది, ట్యూబ్‌పోయింది, బెల్లుకూడా పోయింది. దీన్ని రిపేర్ చేయడం సాధ్యం కాదు. ధ్వసంం చేయాలి. ధ్వంసం అనివార్యం...ధ్వంసానంతరం పునర్నిర్మాణం అనివార్యం - సైకిల్‌పై పరుగుపెడ్తూనే ఉంది వసుధ.

వర్షం కురుస్తూనే ఉంది లోపలా...బయటా.

ఎదురుగా ఐదంతస్తుల భవనంపై ఐదువందల అడుగుల హోర్డింగ్ 'మెక్ డెవల్ నం. 1" - ప్రక్కన ముఖం కనబడని, బొడ్డూ, స్తనాలు మాత్రమే కనిపిస్తున్న యువతి కవ్వించే బొమ్మ...

లిక్కర్ అనే ప్రొడక్ట్‌కీ, ఈ స్త్రీకి ఏమిటి సంబంధం.

స్త్రీలు కూడా బాగా తాగుతారనా, తాగాలనా...!

క్రింద - క్లబ్‌సోడా...అని చిన్నని కనబడని అక్షరాలు -

రూల్స్...రూల్స్....ఎవ్రీథింగ్ ఈజ్ వితిన్ ఫ్రేమ్‌వర్క్ ఆఫ్ రూల్స్..మిస్ ఇంటర్‌ప్రిటిషనాప్ రూల్స్ -

ఎక్కడున్నాయి రూల్సీదేశంలో,

శారదాచట్టం అరచి అరచి నిద్రపోయి, చచ్చిపోయి, సమాధైపోయింది - ఎవడు మానేశాడు కట్నం తీసుకోవడాన్ని...ఎవడు మానేశాడు కట్నం ఇవ్వడాన్ని -

ఎవడో రాశాడు,

"యువతిగా కట్నాన్ని నిరసించి

ఒక తల్లిగా కట్నాన్ని కాంక్షించి..."

స్త్రీకి స్త్రీయే శత్రువా..?

కట్నాల చట్టాలు, బూతు సినిమాల సెన్సార్ చట్టాలు, గుండాల నిర్బంధ చట్టాలు, విచ్చలవిడి మీడియాపై నియంత్రణ చట్టాలు-

అన్నీ ఉన్నాయి...కాని ఏవీ లేవు...ఏవీ పనిచేయవు.

యువతకు జిఆర్ఐ టోఫెల్‌లు కావాలి...అమెరికా వెళ్లాలి...క్విక్ మనీ కావాలి...రాత్రికి రాత్రి కోటీశ్వర్లయి..,

డ్రీమ్స్...స్వీట్ డ్రీమ్స్...వలసల డ్రీమ్స్..డాలర్ డ్రీమ్స్.

తమను తాము కార్పొరేట్ సంస్థలకు అమ్ముకునే డ్రీమ్స్.

తల్లిదండ్రులు పిల్లలను విదేశాలకు తరమాలని డ్రీమ్స్...తొందరగా డాలర్లను బ్యాంకుల్లో బంధించి సుఖాలను పొందాలని డ్రీమ్స్.

చినుకులు...చినుకులు పెద్దవైపోతున్నాయి చిరు చినుకులు.

వర్షం పెద్దదైపోతున్నది...వసుధ లోపల వర్షం పెద్దదైపోతున్నది.

సైకిల్ తడిరోడ్డుపై జర్రుని జారిపోతోంది...వేగంగా...వాన నీళ్లు ఆమె ముఖంపై నుండి ధారలు ధారలుగా కారుతున్నాయి.

ఆకస్మాత్తుగా...హాండిల్‌కు తగిలించిన పుస్తకాల బ్యాగ్ ఔటర్ పాకెట్‌ను తడిమింది చేతితో.

ఉబ్బెత్తుగా వస్తువు తాకింది.

'వస్తువు' భద్రంగానే ఉందన్నమాట....తృప్తిగా ఊపిరి పీల్చుకుని పెడల్‌పై బలంగా కాళ్లను అదిమి...

రాత్రి దృశ్యం జ్ఞాపకమొచ్చిందామెకు.

తమ యిల్లంతా డబ్బు కంపు.

అమ్మ, చిన్నమ్మ, అత్తమ్మ - అందరూ మెడల్లో కిలోల కొద్దీ బంగారం ధరించి,

ఎప్పుడూ టీ.విలో సీరియల్స్,

లేడీ విలన్లు, బ్రూటల్ కుతంత్రాలు...వాటిపై చర్చలు,

ఆడదంటే సొమ్ములు, పట్టుచీరలు, ఖరీదైన బంగళాలు, కార్లు - వీటిలోనే సమాధైపోయిన తన కుటుంబం. స్త్రీ పరివారం..వీళ్ళతో విసిగి విసిగి - మొన్న రాత్రి ఒక చెంబుతో విసిరేసింది తను..టీ.వి. స్క్రీన్ భళ్లున పగిలి.,

అందరూ షాక్ తిని...తన వంక పిచ్చిదానిలా చూసి...

తను మౌనంగా మెట్లెక్కి నడిచి వెళ్ళిపోయింది.

ఏదో ఒక ఉద్ధృతమైన, అనూహ్యమైన నిరసన పెల్లుబుకుతోంది తనలో-ఎవరిమీద...

తన తల్లిమీద, తండ్రిమీద, ఈ వ్యవస్థమీద,

అవినీతి దుష్ట సంస్కృతి మొదట ప్రతి కుటుంబస్థాయిలో వ్యక్తులు వ్యక్తులుగా మొదలై...లంచడం యివ్వడం నేరమనే భావన లేక, లంచం తీసుకోవడం తప్పనే భావన లేక, అన్ని స్థాయిల్లో అవినీతి ఎదిగి ఎదిగి - అదుపు తప్పి...

స్వేచ్ఛ విశృంఖలత్వమై,

స్వతంత్రం విచ్చలవిడితనమై...బరితెగించి విజృంభిస్తూ,

ఎవరు అడ్డుకట్ట వేయాలీ స్థితికి. ఎవడు రక్షించాలీ సమాజాన్ని... ఎవడు సరిదిద్దాలీ సంక్షోభ సంక్లిష్టతలను. కాన్సర్‌లా వ్యాపిస్తున్న ఈ రుగ్మతలను ఎవరు నిర్మూలించాలి.

వసుధ సైకిల్ తొక్కుతూనే ఉంది వేగంగా.

వర్షం విషయం ఆమెకు స్ఫురించడం లేదు.

మొన్న రాష్ట్రపతి పాల్గొన్న విద్యార్థుల సమావేశం గురించిన సన్నివేశం జ్ఞాపకమొచ్చిందామెకు. తను కూడా పాల్గొందందులో.

ఒకరడిగారు - "ఈ దేశంలో అవినీతి ఎలా నిర్మూలించబడ్తుంది" అని రాష్ట్రపతి కలాంను.

అవినీతిని నిర్మూలించే వ్యక్తులు ముగ్గురే అని అన్నారు రాష్ట్రపతి. తల్లీ, తండ్రీ, గురువూ అని.

తండ్రి లంచాలు తీసుకుని కట్టలు కట్టలు తల్లికిస్తాడు.

తల్లి పట్టుచీరలు, సొమ్ములు ధరించి డబ్బును దాస్తుంది.

గురువులు సర్వావినీతిమార్గాలతో డబ్బు సంపాదనలో తలమునకలై ఉంటారెప్పుడూ

అప్పుడు...అవినీతి కట్టలు తెంచుకుని వరదై ప్రవహిస్తూ...

ఎందుకో నవ్వుకుంది వసుధ.

వర్షపు ధారలు ఆమె పెదవులపై తళుక్కున మెరుస్తూ కారుతున్నాయి.

తన తండ్రి ఈ సంవత్సరం యింజనీరింగ్ ఎంట్రన్స్ కన్వీనర్.

ప్రొఫెసర్ నరసింహారావు.,

తన చిన్నాన్న ఒక ముప్పయి కోట్ల రూపాయల ఆనకట్టకు ప్రాజెక్టు యింజనీర్.

తన మరో చిన్నాన్న సిటీ డిఎస్పీ - అన్నీ సెటిల్‌మెంట్సే.

మొన్న రాత్రి ఆయన ఆధ్వర్యంలో నిర్మించబోయే ఆనకట్టను కట్టే కార్పొరేట్ సంస్థ చిన్నాన్నకు ఐదుకోట్ల లంచం ఏ రూపంలో యివ్వాలో ఆ కంపెనీ ఎగ్జిక్యూటివ్స్ ఆయన బెడ్‌రూంలో చర్చించుకుంటూ పార్టీ చేసుకుంటుండగా చూసింది.

గుండెలో వరుసగా పేలే డైనమెట్లు...క్షీణ ప్రమాణాలతో నిర్మించే ఆ ఆనకట్ట కూలిపోతుంది ఏదో ఒకనాడు...ఆనాడు ఎందరు మరణిస్తారో.,

నిన్నరాత్రి రాష్ట్రంలో కార్పొరేట్ విద్యాసంస్థల సమిష్టి బ్రోకర్ నాన్నను కలిసి లక్షలున్న బ్రీఫ్‌కేసును నాన్నకిచ్చి ప్రశ్నల కవర్‌ను తీసుకెళ్లడం గమనించింది తను..అంటే ఎంట్రన్స్ పరీక్షాపత్రం లీకేజ్.

ఏమిటిది...ఏం జరుగుతోందిక్కడ.

ఆచార్యదేవోభవ.

ఎవడు ఆచార్యుడు...ఏమి చేస్తున్నాడీ ఆచార్యుడు.

ఆచార్యుడే తండ్రి....పితృదేవోభవ.

సిగ్గేస్తోంది...చచ్చేంత సిగ్గేస్తోంది...కంపర మెత్తుతోంది...ఒళ్లంతా అశుద్ధమయమై బురదలో ఒక పందివలె తను ఉండిపోయినట్టు అసహ్యమేస్తోంది.

వాన...వాన...ఒకటే వాన

ఎడతెగని ఆలోచనల వాన...ఎటూ తోయని 'కిం కర్తవ్యం' ముసురు.

దొంగతనంగా ఉదయం తీసుకుని పుస్తకాల సంచీలో దాచిన చిన్నాన్న పిస్టల్.

'కిం కర్తవ్యం' – ప్రశ్న

కలుపు మొక్కల నిర్మూలన అనివార్యమే కదా – అది హింసవుతుందా,

మొక్క పెరుగుదలకు చీడ నిర్మూలన అవశ్యమే కదా. అది రక్షణే కదా.

సైకిల్ వేగంగా వచ్చి, బంగళా ముందు...బ్రేకులు వేయబోతుండగా,

విశాలమైన ముందు వాకిట్లో

గుమికూడిన పోలీసులు, మీడియా జనం, వీడియో కెమెరాలు, ఫోటోగ్రాఫర్లు...

"రాత్రింబవళ్లు కష్టపడి ప్రాణప్రదంగా ఈ పరీక్షకు సిద్ధమైన లక్షలమంది విద్యార్థుల జీవితాలు మీరు పేపర్ లీక్ చేయడం వల్ల ఈ రోజు ధ్వంసమైపోయాయి. దీనిక మీ సంజాయిషీ ఏమిటి–"

ప్రశ్న...స్పష్టంగా...ప్రకృతినిండా విస్తరించి, విస్ఫోటించి..ధ్వనిస్తున్నట్టు ప్రశ్న....విలేకరులు అడుగుతున్నారు–

తన తండ్రిని...ప్రశ్నిస్తున్న ఎవరో మీడియా వ్యక్తి,

తలవంచుకుని...నాన్న...ప్రొఫెసర్...ప్రముఖ విద్యావేత్త డాక్టర్ నరసింహారావు...తన తండ్రి.

సిగ్గు సిగ్గు....భరించలేని సిగ్గు

"నో కామెంట్ ప్లీజ్...." జనాన్ని తోస్తున్న చిన్నాన్న....డీఎస్పీ చిన్నాన్న... అవినీతికే మారు పేరైన చిన్నాన్న.

వసుధ....పుస్తకాల సంచీలోనుండి పిస్టల్‌ను బయటకి తీసింది.

ధాం....ధాం....ధాం....

రెండే బుల్లెట్లు–

యిద్దరు వ్యక్తులు నేలపై పడిపోయారు దబాలున.

ఆమె నిశ్చలంగా నిలబడి వుంది...

భద్రకాళిలా..

వర్షం కురుస్తూనే ఉంది... కుండపోతగా...ఎడతెగకుండా. ధారలు ధారలుగా...

●

'నవ్య' వారపత్రిక
తేది : 08-09-2006